జాతీయ దిన పత్రిక

# తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 177 13-7-2026 వెల: రూ.2/- పేజీలు: 06







## గాన కోకిలకు కన్నీటి వీడ్కోలు

- ఎస్.జానకి భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న మనవరాలు అప్సర
- ఎస్.జానకికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు
- అన్నీ తానై నిర్వహించిన మనవరాలు అప్సర
- తరలి వచ్చిన సినీ తారలు, అభిమానులు
- ఆమెతో ఉన్న అనుబంధాన్నిగుర్తు చేసుకుని కన్నీటి పర్యంతం



2లో

## 17న కేబినెట్ భేటీ

సాగునీటి ప్రాజెక్టులపై ప్రధాన చర్చ ఎజెండాపై సీఎంతో ఆదివారం ఉత్తమ్, భట్టి భేటీ



2లో

### వియత్నాం బోటు ప్రమాద ఘటనపై


## సీఎం చంద్రబాబు విచారం

- ఏపీకి చెందిన ముగ్గురు మృతి
- బాధితులకు పూర్తి సహాయం ఆదేశం
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం
- మృతదేహాల తరలింపునకు చర్యలు



వియత్నాంలో జరిగిన పర్యాటక బోటు ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు పర్యాటకులు మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి మొత్తం 33 మంది వియత్నాం పర్యటనకు వెళ్లగా, వారిలో 19 మంది ప్రమాదానికి గురైన బోటులో ఉన్నారు. ఈ ప్రమాదంలో కడప జిల్లాకు చెందిన ముడియం శ్రీధర్, కృష్ణా జిల్లాకు చెందిన గెల్లి జయలక్ష్మి, సత్యసాయి జిల్లాకు చెందిన నల్లపేట ఆదిశేషయ్య రవి తేజ మృతి చెందారు. కృష్ణా జిల్లాకు చెందిన గెల్లి కిశోర్ తీవ్ర అస్వస్థతతో ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. మిగిలిన వారందరూ సురక్షితంగా ఉన్నారు. విహారయాత్రకు వెళ్లిన రాష్ట్రానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.

- మిగతా 2వ పేజీలో



## మళ్లీ భగ్గుమన్న పశ్చిమాసియా

- నౌకలో 11 మంది భారతీయ నావికులు
- 10 మంది క్షేమం.. ఒకరి గల్లంతు
- ఇరాన్‌పై మరోసారి విరుచుకుపడిన అమెరికా
- 140 ఇరాన్ సైనిక లక్ష్యాలు ధ్వంసం
- అమెరికాపై ఇరాన్ ప్రతీకారం
- బహ్రెయిన్, కువైట్, ఖతార్, ఒమన్‌లపై ఇరాన్ దాడులు

దుబాయ్: పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. దాడులు, ప్రతిదాడులు కొనసాగుతున్నాయి. ఆదివారం తెల్లవారుజామున ఒమన్ తీరంలో హార్మూజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న వాణిజ్య నౌక 'జీఎఫ్ఎస్ గెలాక్సీ'పై ఇరాన్ సైన్యం దాడికి దిగింది. ఆ సమయంలో నౌకలో మొత్తం 11 మంది భారతీయ నావికులు ఉన్నారు. వారిలో 10 మందిని రక్షించగా, ఒకరు గల్లంతయ్యారు. అతడి ఆచూకీ ఇంకా తెలియరాలేదు. ఘటనలో మొత్తంగా 23 మందిని కాపాడారు. వాణిజ్య నౌకపై ఇరాన్ దాడిని భారత ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. గల్లంతైన నావికుడి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. మస్కట్‌లోని ఒమన్ అధికారులతో కలిసి ఇండియన్ ఎంబసీ గాలింపు

- మిగతా 2వ పేజీలో



## పవన్ కల్యాణ్ ఆరోగ్యంపై ప్రకటన విడుదల చేసిన ముంబై ఆసుపత్రి

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆరోగ్యంపై ముంబై ఆసుపత్రి అధికారిక బులెటిన్
- కుడి భుజానికి విజయవంతంగా ఆర్థోస్కోపిక్ సర్జరీ పూర్తి
- ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని, వేగంగా కోలుకుంటున్నారని వెల్లడి
- పూర్తిగా కోలుకుని భుజం సాధారణ స్థితికి రావడానికి 4 నెలల సమయం
- ప్రముఖ వైద్యుడు డాక్టర్ దిన్‌షా పర్దివాలా ఆధ్వర్యంలో శస్త్రచికిత్స

## "చిల్లర లేకపోతే దిగిపో..'

2లో

- ' మంత్రికే షాక్ ఇచ్చిన బస్ కండక్టర్..
- ప్రయాణికుడి వేషంలో బీఎంటీసీ బస్సుల్లో మంత్రి తనిఖీలు.
- రూ.100కు చిల్లర లేదని మంత్రినే బస్సు దిగమన్న కండక్టర్.
- ప్రయాణికుడిని స్టాప్ వద్ద దింపకపోవడంతో డ్రైవర్, కండక్టర్ సస్పెన్షన్.
- బెంగళూరులో ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని మంత్రి స్పష్టం.



## నీళ్లు అడిగితే రక్తం కావాలా?

- రూ. ఏడు వేల కోట్లతో పోలవరాన్ని ముంచిన అధికారులతో మేడిగడ్డపై రిపోర్టులా?
- పట్టిసీమకు నీళ్లు వదిలేసి గురువు చంద్రబాబుకు రేవంత్‌రెడ్డి గురుదక్షిణ
- నన్ను జైల్లో వేసినా సరే.. నా ప్రాణం పోయినా సరే.. మోటార్లు ఆన్ చేసి రైతులను కాపాడండి
- బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు




హైదరాబాద్: రైతులు సాగునీరు అడిగితే రక్తం కావాలంటూ మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, షాబాద్‌లో ఆరుగురిని హత్య చేసిన నరహంతకుడికి పెద్దగా తేడా కనిపించడం లేదని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో విమర్శించారు. ప్రతిపక్షాల రక్తాన్ని పంటలపై చల్లాలని, బెల్టుతో కొట్టాలని ఒక ముఖ్యమంత్రి మాట్లాడటం అత్యంత జుగుప్సాకరమని మండిపడ్డారు. హిట్లర్‌ను ఆదర్శంగా చెప్పుకునే రేవంత్ అదే తరహా హంతక భాష మాట్లాడుతున్నారని ఆరోపించారు. రైతుల పంటలను కాపాడాల్సిన ప్రభుత్వం ఈగోతో కన్నెపల్లి, దేవాదుల మోటార్లను నిలిపివేసి

- మిగతా 2వ పేజీలో

## షాబాద్ ఆరు హత్యల కేసు.. కిరాతకుడు రాజ్‌కుమార్ ఆచూకీపై వీడని సస్పెన్స్!

- షాబాద్‌లో ఆరుగురిని హత్య చేసిన నిందితుడు రాజ్‌కుమార్ పరారీ
- ఆత్మహత్య చేసుకోలేదని, రైలెక్కి పారిపోయాడని నిర్ధారించిన పోలీసులు
- నిందితుడి కోసం 10 ప్రత్యేక బృందాలతో ముమ్మర గాలింపు
- ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించినందుకు షాబాద్ ఎస్సై సస్పెన్షన్
- పోక్సో కేసులో కక్ష పెంచుకునే ఈ ఘోరానికి పాల్పడినట్లు వెల్లడి



2లో

## గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను పరామర్శించనున్న వైసీపీ అధినేత

- ఈ నెల 14న విశాఖకు వెళ్లనున్న జగన్
- బోటు ప్రమాదంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు పరామర్శ
- ప్రభుత్వ వైఫల్యంపై తీవ్రస్థాయిలో మండిపడ్డ వైసీపీ నేతలు
- సీఎం, డిప్యూటీ సీఎం మౌనంపై వైసీపీ విమర్శలు

2లో



## “చిల్లర లేకపోతే దిగిపో..”

కర్ణాటక రవాణా మంత్రి బైరతి సురేష్, ప్రయాణికుడి వేషంలో శనివారం రాత్రి బెంగళూర్‌లో బీఎంటీసీ బస్సుల్లో ప్రయాణించారు. ప్రయాణికుల సౌకర్యాలను అంచనా వేయడానికి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఒక సాధారణ ప్రయాణికుడిగా నటిస్తూ ప్రజలకు అందుతున్న సౌకర్యాలు, బస్సు డ్రైవర్-కండక్టర్ పనితీరును అంచనా వేశారు. సుమారు 2 గంటల పాటు 10కి పైగా బస్సుల్లో ఆయన ప్రయాణించారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో మంత్రికి పలు షాక్‌లు తగిలాయి. కొందరు డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులతో నిర్లక్ష్యంగా వ్యవహరించడం చూశారు. నిర్లక్ష్యం మరియు నిబంధనల ఉల్లంఘనలను కారణంగా చూపుతూ, బీఎంటీసీ బస్సు డ్రైవర్, కండక్టర్‌ను తక్షణమే సస్పెండ్ చేస్తూ మంత్రి కఠినమైన ఉత్తర్వులు జారీ చేశారు. తనిఖీ సమయంలో ఒక ప్రయాణికుడు బస్సు దిగుతున్నానని చెబుతున్నప్పటికీ బస్ స్టాప్‌లో ఆపకపోవడంపై ఇద్దరు ఉద్యోగుల్ని సస్పెండ్ చేశారు. ఇదిలా ఉంటే, మరో బస్సులో మంత్రికే ఓ కండక్టర్ షాక్ ఇచ్చారు. హెబ్బాల్ నుంచి నాగశెట్టిహళ్లీ మార్గంలో ప్రయాణిస్తుండగా, టికెట్ కోసం మంత్రి రూ. 100 నోటు ఇస్తే చిల్లర లేదని చెబుతూ కండక్టర్ మంత్రిని బస్సు దిగిపో అని హెచ్చరించడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఉద్యోగులు క్రమశిక్షణ, జవాబుదారీతనంతో వ్యవహరించేందుకు మంత్రి సురేష్ ఈ చర్యలు తీసుకున్నారు.

## గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను పరామర్శించనున్న వైసీపీ అధినేత

వైసీపీ అధినేత జగన్ విశాఖపట్నంలో పర్యటించనున్నారు. ఇటీవల సముద్రంలో జరిగిన పడవ ప్రమాదంలో గల్లంతైన ఆరుగురు మత్స్యకారుల కుటుంబాలను ఆయన పరామర్శించనున్నారు. ఈ నెల 14వ తేదీన జగన్ పర్యటన ఖరారైంది. ఈ పర్యటన వివరాలను వైసీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆదివారం వెల్లడించారు. జూలై 14న ఉదయం 10:30 గంటలకు జగన్ విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారని, అక్కడి నుంచి నేరుగా దక్షిణ నియోజకవర్గంలోని జబ్బరుపేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను ఓదార్చుతారని తెలిపారు. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన కరి చిన్నాతో పాటు అతని కుటుంబ సభ్యులతోనూ జగన్ మాట్లాడతారని చెప్పారు. ఈ సందర్భంగా కేకే రాజు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తీరానికి కేవలం 8 నాటికల్ మైళ్ల దూరంలో ప్రమాదం జరిగినా, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరడానికి 20 గంటల సమయం పట్టిందని ఆరోపించారు. కోస్ట్ గార్డ్, నేవీ, మెరైన్ పోలీసు, మత్స్య, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగానే ఆరుగురు మత్స్యకారులు గల్లంతయ్యారని అన్నారు. గల్లంతైన వారి ఆచూకీ లభించకముందే రెస్క్యూ ఆపరేషన్‌ను నిలిపివేయడాన్ని ఆయన తప్పుబట్టారు. జిల్లాకు చెందిన హోం మంత్రి అనిత బాధితులను పరామర్శించకపోవడం దారుణమన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు ఈ విషాదంపై మౌనంగా ఉన్నారంటూ విమర్శించారు. జూలై 4న గంగవరం తీరానికి 10 నాటికల్ మైళ్ల దూరంలో ఏడుగురు మత్స్యకారులతో వెళ్లిన మర పడవ బోల్తా పడిన విషయం తెలిసిందే. వీరిలో ఒకరు ప్రాణాలతో బయటపడగా, ఆరుగురి ఆచూకీ లభించలేదు. నాలుగు రోజుల పాటు నేవీ, కోస్ట్ గార్డ్ గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోవడంతో ఆపరేషన్‌ను నిలిపివేశారు. రాష్ట్ర ప్రభుత్వం గల్లంతైన వారి కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది.

## పవన్ కల్యాణ్ ఆరోగ్యంపై ప్రకటన విడుదల చేసిన ముంబై ఆసుపత్రి

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిపై ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రి యాజమాన్యం అధికారికంగా ఒక ప్రత్యేక హెల్త్ బులెటిన్‌ను విడుదల చేసింది. ఆయన కుడి భుజానికి జరిగిన శస్త్రచికిత్స విజయవంతమైందని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, వేగంగా కోలుకుంటున్నారని స్పష్టం చేసింది. ఈ మేరకు ఆసుపత్రి ఆర్థ్రోస్కోపీ అండ్ షోల్డర్ సర్వీస్ డైరెక్టర్, ప్రముఖ వైద్యుడు డాక్టర్ దిన్‌షా పార్దీవాలా ఆదివారం (జూలై 12) ఈ ప్రకటన జారీ చేశారు. వైద్య బులెటిన్ ప్రకారం, పవన్ కల్యాణ్ కుడి భుజంలోని ‘రొటేటర్ కఫ్’కు తీవ్రమైన గాయమైంది. భుజంలోని సుప్రాస్పినేటస్, ఇన్‌ఫ్రాస్పినేటస్ అనే కండర బంధనాలు (టెండన్స్) అధికంగా చిరిగిపోవడంతో పాటు, గ్రేటర్ ట్యూబరోసిటీ ఎముక వద్ద ఫ్రాక్చర్ కూడా అయినట్లు నిర్ధారణ అయిందని వైద్యులు వివరించారు. ఈ గాయానికి జూలై 11న కోకిలాబెన్ ఆసుపత్రిలో విజయవంతంగా ‘ఆర్థ్రోస్కోపిక్ రిపేర్’ సర్జరీ నిర్వహించినట్లు డాక్టర్ పార్దీవాలా పేర్కొన్నారు. కీ-హోల్ పద్ధతిలో జరిగిన ఈ ఆపరేషన్ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా ముగిసిందని, ప్రస్తుతం పవన్ కల్యాణ్ సౌకర్యంగా ఉన్నారని బులెటిన్‌లో తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం ఆయన కొంతకాలం విశ్రాంతి తీసుకుంటారని, ఆ తర్వాత వైద్యుల పర్యవేక్షణలో ఒక పక్కా ప్రణాళికతో కూడిన ‘షోల్డర్ రిహాబిలిటేషన్ ప్రోగ్రామ్’ ఉంటుందని వెల్లడించారు. ఈ పునరావాస ప్రక్రియ ద్వారా రాబోయే నాలుగు నెలల్లో ఆయన భుజం పనితీరు తిరిగి పూర్తిగా సాధారణ స్థితికి వస్తుందని అంచనా వేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఏపీ డిప్యూటీ సీఎంగా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిపై అభిమానులు, జనసేన కార్యకర్తల్లో నెలకొన్న ఆందోళనకు ఈ అధికారిక ప్రకటనతో తెరపడినట్లయింది. ఆయన త్వరగా కోలుకోవాలని పలువురు రాజకీయ ప్రముఖులు, అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

## 17న కేబినెట్ భేటీ

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఈ నెల 17న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. రాష్ట్రంలోని పలు కీలకమైన సాగునీటి ప్రాజెక్టుల అంచనా వ్యయాల పెంపునకు సంబంధించిన ప్రతిపాదనలపై ఈ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. సీఎం రేవంత్‌తో ఆదివారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమావేశమై ప్రాజెక్టుల అంచనా పెంపుతోపాటు నీటిపారుదల శాఖకు సంబంధించిన ఇతర కీలక అంశాలపై చర్చించినట్టు తెలిసింది. పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టులోని ప్యాకేజీలు--7, 11, 15, 17ల అంచనాల పెంపు, జె.చొక్కారావు దేవాదుల ప్రాజెక్టు అంచనాలు తుదిసారిగా పెంపు, గట్టు రిజర్వాయర్ సామర్థ్యం పెంపునకు సంబంధించిన ప్రతిపాదనలపై గతంలో ఆర్థిక శాఖ కొర్రీలు వేయడంతో రాష్ట్ర మంత్రివర్గ ఆమోదానికి నోచుకోవడం లేదు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రాజెక్టులను సందర్శించి ఇచ్చిన హామీల అమలులో సైతం పురోగతి లేకుండా పోయింది.

# గాన కోకిలకు కన్నీటి వీడ్కోలు

మైసూరు: తన గానామృతంతో కోట్లాది మందిని ముగ్ధుల్ని చేసిన ఆ మధుర కంఠం చితి మంటల్లో పంచభూతాల్లో కలిసిపోయింది. తన సుమధుర కంఠంతో కోట్లాది గుండెల్లో చెరగని స్థానం సంపాదించిన గాన కోకిల ఎస్.జానకి పార్థివ దేహానికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం మైసూరులోని కనియనహుండి ఫామ్‌హౌస్‌లో సినీ, రాజకీయ ప్రముఖులు, వేలాది మంది అభిమానులు, బంధు మిత్రుల కన్నీటి సంద్రం మధ్య ఈ కార్యక్రమం కొనసాగింది. 88 ఏళ్ల వయసులో శనివారం సాయంత్రం ఆమె వయో సమస్యలతో చికిత్స పొందుతూ కన్నుమూసిన విషయం తెలిసిందే. జానకి పార్థివ దేహాన్ని ప్రజల సందర్శనార్థం ఆదివారం ఉదయం 8:53 గంటలకు జిల్లా అధికారులు అంబులెన్సులో మహారాజా కళాశాల మైదానానికి తీసుకువచ్చారు. ఆమె పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించేందుకు పెద్ద సంఖ్యలో కన్నడ చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు మైసూరుకు తరలివచ్చారు. రచయితలు, గాయకులు, సంగీత దర్శకులు, సినీ నటీమణులు, నిర్మాతలు, కళాకారులు కన్నీటితో నివాళులర్పించారు. ప్రముఖ గాయని చిత్ర, సీనియర్ నటి జయమాల, తార, నిర్మాత కె.మంజు, నటుడు వినోద్ రాజ్, గాయకుడు రాజేష్ కృష్ణన్, ప్రముఖ సంగీత దర్శకుడు సాధు కోకిల తదితర శాండల్‌వుడ్ నటీనటులు ఈ సందర్భంగా సంగీత ప్రపంచానికి ఎస్.జానకి చేసిన సేవల గురించి కొనియాడారు. వేలాది మంది ప్రజలు క్యూలో నిలబడి ఆమెను కడసారి చూసుకున్నారు. అక్కడికి తరలి వచి?చన వారందరికీ కనిపించేలా ఎల్‌ఈడీ స్క్రీన్‌లపై ప్రత్యక్ష ప్రసారం చేశారు. కర్ణాటకతో పాటు పొరుగు రాష్ట్రాలైన కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో అభిమానులు, సినీ, రాజకీయ రంగ ప్రముఖులు తరలివచ్చారు. కొందరైతే తమ కుటుంబాలతో సహా వచ్చి కన్నీటితో నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాల గాయకుల బృందం ఎస్.జానకి సూపర్ హిట్ గీతాల ఆలాపన నిర్వహించడం అందరి గుండెల్లో ఆర్ద్రత నింపింది. అనంతరం కర్ణాటక సీఎం డీకే శివకుమార్, మైసూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి యతీంద్ర సిద్ధరామయ్య, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీఎం డి.కె.శివకుమార్ మాట్లాడుతూ.. ఎస్.జానకి భారతదేశం గర్వించదగ్గ సంగీత దిగ్గజాల్లో ఒకరని కొనియాడారు. ఆమె వారసత్వాన్ని చిరస్థాయిగా నిలిపేందుకు చిత్ర పరిశ్రమతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎస్.జానకి అంత్యక్రియల నిర్వహణకు సంబంధించి కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్ని చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో మధ్యాహ్నం 3:05 గంటలకు ఎస్.జానకి పార్థివ దేహాన్ని పూలతో అలంకరించిన వాహనంలో రాజ లాంఛనాలతో ఊరేగింపుగా మైసూరు సమీపంలోని హెచ్‌డి కోటె తాలూకా కణియర హుండిలోని ఫాంహౌస్‌లో అంత్యక్రియల స్థలికి తీసుకొచ్చారు. పోలీసులు జాతీయ గీతాలాపన మధ్య గన్ సెల్యూట్ ఇచ్చి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా మనవరాలు వైద్యుల అప్సర తన నాన్నమ్మను దగ్గరగా చూస్తూ కొన్ని క్షణాలు గడిపారు. అది చూసి అందరి కళ్లు చెమర్చాయి. అనంతరం వేద మంత్రాల మధ్య ఆమె తన నాన్నమ్మ చితికి నిప్పంటించి కుటుంబ సంప్రదాయం మేరకు అంత్యక్రియలు నిర్వహించారు. మట్టి కుండను భుజంపై మోస్తూ చితి చుట్టూ ప్రదక్షిణ చేశారు. వేద పండితులు రమేష్ శర్మ బృందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం పూర్తయింది. అప్సర.. జానకి కుమారుడు మురళీకృష్ణ కుమార్తె. మురళీకృష్ణ ఈ ఏడాది జనవరి 22న మరణించారు. 1938 ఏప్రిల్ 23న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా పల్లపట్లలో జన్మించిన ఎస్.జానకి.. చివరి ఆరేళ్లు మైసూరును తన నివాసంగా ఎంచుకున్నారు. ఆమె కోరిక మేరకు అక్కడే అంత్యక్రియలు నిర్వహించారు.

## షాబాద్ ఆరు హత్యల కేసు.. కిరాతకుడు రాజ్‌కుమార్ ఆచూకీపై వీడని సస్పెన్స్!



రంగారెడ్డి జిల్లా షాబాద్‌ను ఉలిక్కిపడేలా చేసిన ఆరుగురి వరుస హత్యల కేసులో నిందితుడు రాజ్‌కుమార్ ఆచూకీ ఇప్పటికీ లభించలేదు. అతను ఆత్మహత్య చేసుకుని ఉంటాడన్న అనుమానాలను పటాపంచలు చేస్తూ, పక్కా ప్రణాళికతోనే రైలెక్కి పారిపోయాడని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. నిందితుడిని పట్టుకునేందుకు సుమారు 10 ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి, గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. ఘోర హత్యాకాండకు పాల్పడిన తర్వాత రాజ్‌కుమార్ తన తండ్రికి ఫోన్ చేసి చనిపోతానని చెప్పడంతో అతను ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని మొదట భావించారు. అయితే, నందిగామ సమీపంలో నిందితుడి కారును, మొబైల్ సిగ్నల్‌ను పోలీసులు గుర్తించారు. అక్కడి సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించగా, అతను కారును వదిలేసి నందిగామ రైల్వే స్టేషన్ వైపు వెళ్లినట్లు స్పష్టమైంది. దీంతో రైల్వే స్టేషన్‌లోని దృశ్యాలను విశ్లేషిస్తున్న పోలీసులు, అతను ఆత్మహత్య చేసుకోలేదని, తప్పించుకునేందుకే రైలు మార్గాన్ని ఎంచుకున్నాడని తేల్చారు.

**పోలీసుల నిర్లక్ష్యమే కొంపముంచిందా?**

ఈ దారుణానికి పోలీసుల నిర్లక్ష్యమే కారణమని బాధితుల కుటుంబ సభ్యులు, స్థానికులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. గతంలో ఓ మైనర్ బాలికను వేధించిన కేసులో పోక్సో చట్టం కింద అరెస్టయిన రాజ్‌కుమార్, జైలు నుంచి విడుదలయ్యాక కక్ష పెంచుకున్నాడు. ‘మీ అంతు చూస్తా’ అంటూ బాధితుల కుటుంబాన్ని బెదిరించాడు. ఈ విషయంపై వారు స్థానిక పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కన్నీరుమున్నీరవుతున్నారు. “అతడే భయపడుతున్నాడు. మీరేం కంగారు పడొద్దు” అని కేసు దర్యాప్తు అధికారి అయిన ఎస్సై రమేశ్ తేలిగ్గా తీసిపారేసినట్లు బాధితులు వాపోతున్నారు. వారి ఫిర్యాదులను తీవ్రంగా పరిగణించని కారణంగానే శనివారం ఈ ఘోరం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిందితుడు మొదట బాలిక, ఆమె తల్లి, నానమ్మను దారుణంగా నరికి చంపి, ఆ తర్వాత తన భార్య, ఇద్దరు పిల్లలను కూడా హతమార్చాడు. ఈ ఆరోపణల నేపథ్యంలో విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు షాబాద్ ఎస్సై రమేశ్‌ను ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి తక్షణమే సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం నిందితుడు ఏ రైలు ఎక్కాడు, ఎక్కడికి పారిపోయాడనే కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

## వియత్నాం బోటు ప్రమాద ఘటనపై సీఎం చంద్రబాబు విచారం

(మొదటి పేజీ తరువాయి)

ప్రమాదంలో గాయపడిన వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందేలా చూడాలని, ప్రాణాలతో బయటపడిన వారిని సురక్షితంగా రాష్ట్రానికి తీసుకురావడానికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉండాలని, వారికి అవసరమైన సహాయ సహకారాలు వెంటనే అందించాలని సీఎం ఆదేశించారు. ఢిల్లీలోని ఏపీ భవన్ అధికారులు వియత్నాం ప్రభుత్వ అధికారులు, అక్కడి భారత రాయబార కార్యాలయంతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే మృతదేహాలను స్వదేశానికి త్వరితగతిన తరలించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

## నీళ్లు అడిగితే రక్తం కావాలా?

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రాన్ని కరువు వైపు నెడుతోందన్నారు. తనను జైల్లో వేసినా, తన ప్రాణం పోయినా అభ్యంతరం లేదని, కానీ వెంటనే మోటార్లు ఆన్ చేసి రైతులను ఆదుకోవాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరిలో ప్రస్తుతం లక్ష క్యూసెక్కులకు పైగా వరద ప్రవహిస్తున్నా ప్రభుత్వం కావాలనే నీటిని ఎత్తడం లేదని హరీశ్ ఆరోపించారు. మేడిగడ్డ గేట్లు మూయకుండానే కన్నెపల్లి మోటార్లు నడపొచ్చని, ఇదే విషయాన్ని నిపుణులు, రిటైర్డ్ ఇంజనీర్లు, ఇరిగేషన్ అధికారులు కూడా ప్రభుత్వానికి స్పష్టం చేశారని తెలిపారు. కేవలం రూ. 8.5 కోట్లతో కాఫర్ డ్యామ్ నిర్మించి నీటిని ఎల్లంపల్లికి తరలించొచ్చని అధికారులు సూచించినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై చేసిన దుష్ప్రచారం బయటపడుతుందనే భయంతోనే మోటార్లు ఆన్ చేయడం లేదని విమర్శించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ఇప్పుడు నీటిని ఎత్తకపోతే ఎన్టీపీసీ, సింగరేణి, హైదరాబాద్ తాగునీటి అవసరాలు దెబ్బతినడంతోపాటు థర్మల్ విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మేడిగడ్డపై నివేదిక ఇచ్చిన ఎన్‌డీఎస్‌ఏ అధికారులే పోలవరం ప్రాజెక్టులో రూ.వేల కోట్ల నష్టానికి బాధ్యులని హరీశ్ ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో 6.64 లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందగా, బీఆర్ఎస్ హయాంలో 48.74 లక్షల ఎకరాలకు నీరందించామని హరీశ్ పేర్కొన్నారు. దేవాదులలో పూర్తిస్థాయిలో మోటార్లు నడపకుండా, గోదావరి జలాలను కిందకు వదిలి పట్టిసీమకు మేలు చేస్తూ సీఎం తన రాజకీయ గురువు చంద్రబాబుకు గురుదక్షిణ ఇస్తున్నారని ఆరోపించారు.

# మళ్లీ భగ్గుమన్న పశ్చిమాసియా

(మొదటి పేజీ తరువాయి)

చర్యలను సమీక్షిస్తోంది. ఇరాన్ దాడిలో నౌక వెంటనే మంటల్లో చిక్కుకుంది. హోర్ముజ్ జలసంధిని మరోసారి మూసివేసినట్లు ప్రకటించడానికి కొద్దిసేపటి ముందు హెచ్చరికగా జరిపిన దాడికి ఇరాన్ అభివర్ణించింది. ఈ దాడిలో సైప్రస్ జెండా కలిగిన జీఎఫ్ఎస్ గెలాక్సీ నౌక అగ్గి?నకి ఆహుతయ్యింది. హోర్ముజ్‌లో అది అనుమతి లేని మార్గంలో ప్రయాణిస్తోందని ఇరాన్ పేర్కొంది. ఈ ఘటన పట్ల ఎవరైనా ప్రతీకార చర్యకు దిగితే తమ ప్రతిస్పందన తీవ్రస్థాయిలో ఉంటుందని హెచ్చరించింది. మరోవైపు జీఎఫ్ఎస్ గెలాక్సీపై జరిగిన దాడిని కారణంగా చూపుతూ అమెరికా సైన్యం ఇరాన్‌పై మరో విడత దాడులు చేపట్టింది. ఈ వారంలో ఇరాన్ లక్ష్యాలపై అమెరికా జరిపిన దాడుల్లో ఇది మూడోది. ఆదివారం తెల్లవారుజామున ఇరాన్‌లోని సుమారు 140 సైనిక లక్ష్యాలపై అమెరికా దాడులుచేసింది. ఇరాన్ క్షిపణి, డ్రోన్ స్థావరాలు, నౌకాదళ సామర్థ్యాలు, మందుగుండు సామగ్రి నిల్వ సౌకర్యాలు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, తీరప్రాంత నిఘా కేంద్రాలపై దాడులు చేశామని అమెరికా సెంట్రల్ కమాండ్ ఆదివారం వెల్లడించింది. ఇరాన్‌లోని అత్యంత కీలకమైన ఖెష్మ్ దీవిపై ఆదివారం మధ్యాహ్నం నుంచి వరుస దాడులు జరుగుతున్నట్లు సమాచారం. ఇరాన్ అధికార వార్తా సంస్థ ఈ విషయం ప్రకటించింది. దీవిలోని సైనిక లక్ష్యాలపై కనీసం డజను దాడులు జరిగినట్లు తెలిపింది. అమెరికా తాజా దాడుల పట్ల ఇరాన్ వెంటనే ప్రతిచర్యకు దిగింది. ఆదివారం ఉదయం బహ్రెయిన్, కువైట్, ఖతార్, యూఏఈ, ఒమన్‌లపై వైమానిక దాడులకు దిగింది. అమెరికా సైనిక స్థావరాలు, మౌలిక సదుపాయాలే లక్ష్యంగా క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించింది. ఇరాన్ ప్రయోగించిన పలు క్షిపణులను మార్గమధ్యంలోనే అడ్డుకున్నట్లు ఖతార్ సైన్యం ప్రకటించింది. పొరుగున ఉన్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. ఖతర్‌లో ఇరాన్ దాడులను అడ్డుకునే క్రమంలో పడిన గగనతల రక్షణ వ్యవస్థ శకలాల కారణంగా ఒక చిన్నారితో సహా ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. ఇరాన్ క్షిపణులను మధ్యలోనే ధ్వంసం చేశామని కువైట్ వెల్లడించింది. అమెరికా దూకుడుపై ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘేర్ గాలిబాఫ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. నౌకలు అనుమతి లేని మార్గాల్లో ప్రయాణిస్తున్నాయని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఆరోపించింది. వాటిలో ఒకనౌకపై ముందస్తు హెచ్చరికగా కాల్పులు జరపాల్సి వచ్చిందని తెలిపింది. హోర్ముజ్‌ను మూసేశామని పేర్కొంది. అయితే హోర్ముజ్ తెరచే ఉందని అమెరికా పేర్కొంది. ఇరాన్ నూతన సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ వచ్చేవారం ప్రజల ముందుకు రాబోతున్నట్లు తెలుస్తోంది. దివంగత సుప్రీంలీడర్ అయతొల్లా అలీ ఖమేనీ సంస్మరణ సభను వచ్చేవారం నిర్వహించబోతున్నట్లు ఇరాన్ ప్రభుత్వం వెల్లడించింది. ఈ నెల 23న సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల దాకా ఈ సభ జరుగనుంది. అయితే, ఈ కార్యక్రమానికి మొజ్తబా హాజరవుతారా? లేదా? అనే దానిపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదు.



# రామిరెడ్డి ఆశయాలను సాధిద్దాం

**- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాటూరి బాలరాజు**

**- సంగెంలో కామ్రేడ్ నోముల రామిరెడ్డి 20వ వర్ధంతి**

**వలిగొండ, తొలివెలుగు:** అమరజీవి కామ్రేడ్ నోముల రామిరెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆయన ఆశయాలను నిజం చేసినప్పుడే నిజమైన నివాళి అని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాటూరి బాలరాజు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని సంగెం గ్రామంలో నోముల రామిరెడ్డి 20వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాలరాజు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడారు. రామిరెడ్డి ఉన్నత కుటుంబంలో జన్మించినప్పటికీ, పేదల పక్షాన నిలిచారని కొనియాడారు. నాటి సీపీఎం డివిజన్ నాయకులు కందాల రంగారెడ్డి సారథ్యంలో సంగెం గ్రామంలో ప్రభుత్వ బంచరాయి, పోరంబోకు భూములను భూమిలేని పేదలకు, వివిధ వృత్తిదారులకు పంచేందుకు పెద్ద ఎత్తున పోరాటాలు చేశారని గుర్తుచేశారు. ఆనాటి ప్రభుత్వాల మెడలు వంచి పేదలకు భూములు ఇప్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఎర్రజెండా నాయకత్వంలోనే పేదల సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో వర్కట్‌పల్లి, గోకారం తదితర పరిసర గ్రామాల్లో పార్టీ విస్తరణకు అనేక మంది కార్యకర్తలను తయారు చేశారన్నారు. నేటి ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహించడమే ఆయనకు ఇచ్చే అసలైన గౌరవమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నోముల జంగారెడ్డి, మండల కమిటీ సభ్యులు కవిడే సురేష్, శాఖ కార్యదర్శి భీమనబోయిన జంగయ్య, మాజీ సర్పంచ్ కాసుల కృష్ణ, నాయకులు అంగిడి దేవేందర్ రెడ్డి, ఏనుగు ప్రభాకర్ రెడ్డి, మల్లారెడ్డి, వివిధ పార్టీల నాయకులు తాడూరి లింగస్వామి, కోలన్ రామిరెడ్డి, మంద నరసింహ, జక్కుల వెంకటేష్, ఉండ్రాటి వెంకటేష్, నోముల మహేందర్ రెడ్డి, రామిరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పాపన్న సేవా సమితి జిల్లా కన్వీనర్‌గా జంపయ్య గౌడ్



**తొలివెలుగు, రాజాపేట :** సర్దార్ సర్వాయి పాపన్న సేవా సమితి జిల్లా కన్వీనర్‌గా రాజపేట మండలం సోమారం గ్రామానికి చెందిన బొమ్మకంటి జంపయ్య గౌడ్ నియమితులయ్యారు. ఆదివారం ఆయన జై గౌడ్ ఉద్యమం జాతీయ అధ్యక్షుడు వట్టికూటి రామారావు గౌడ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా జంపయ్య గౌడ్ మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న ఆశయ సాధనకు, సమాజ సేవకు అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు. జంపయ్య గౌడ్ నియామకం పట్ల పలువురు సంఘ సభ్యులు, గ్రామ పెద్దలు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జై గౌడ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఘనగాని మల్లేశం గౌడ్, ఎల్. బత్తిని రాజ్ గౌడ్, బత్తిని రాజు గౌడ్, రాష్ట్ర కార్యదర్శి ఎరుకల యతీశ్వర్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ సూధగాని రామచంద్రయ్య గౌడ్, జై గౌడ్ మండల అధ్యక్షుడు సురవి రవి గౌడ్, నారపల్లి కార్పొరేటర్ పంబాల యాదయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


# వాన దేవుడా.. కరుణించు..

**- నవభారత్ కాలనీలో కప్పతల్లి ఆట**

**- వర్షాల కోసం చిన్నారుల వీధి ప్రదక్షిణలు**

**- గడపగడపనా జలాభిషేకాలు**


**తొలివెలుగు, రాజాపేట:** మృగశిర కార్తె ముగిసి, ఆషాఢం సగం దాటుతున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో వరుణదేవుడిని ప్రసన్నం చేసుకునేందుకు రాజాపేటలో వినూత్న వేడుక నిర్వహించారు. మండల కేంద్రంలోని నవభారత్ కాలనీలో ఆదివారం చిన్నారులు సంప్రదాయబద్ధంగా 'కప్పతల్లి ఆట' ఆడారు. రోకలి మధ్యలో తెల్లటి వస్త్రంలో కప్పను ఉంచి, దానికి వేప కొమ్మలు కట్టి కాలనీలోని వీధివీధినా తిప్పారు. ఇంటింటికీ తిరుగుతున్న చిన్నారులను చూసి మహిళలు, కాలనీవాసులు తమ గడపల వద్దకు రాగానే కప్పతల్లిపై నీళ్లు పోసి జలాభిషేకం చేశారు. వానలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని, తాగునీటి కష్టాలు తీరాలని వరుణుడిని వేడుకున్నారు. అనంతరం సాయంత్రం వేళ గ్రామ పొలిమేరల్లో కప్పను సురక్షితంగా వదిలిపెట్టి, గ్రామ దేవతకు జలాభిషేకం చేశారు. సకాలంలో వర్షాలు పడకపోతే సాగు, తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని ఈ సందర్భంగా స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.



# కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల సొంతింటి కల సాకారం

**- ధర్మోజిగూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మ**

**- గ్రామంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం**



**తొలివెలుగు, చౌటుప్పల్:** నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ధర్మోజిగూడెం గ్రామ సర్పంచ్ జువ్వి నర్సింహ్మ అన్నారు. చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం గ్రామంలో ఊదరి సుశీల-గోపాల్ దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ జువ్వి నర్సింహ్మ నూతన గృహాన్ని ప్రారంభించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో ఊదరి సుశీల-గోపాల్ దంపతులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని తెలిపారు. వారు సొంత ఇంటిలో గృహప్రవేశం చేయడం ఆనందంగా ఉందన్నారు. పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఇల్లు లేని అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని సర్పంచ్ హామీ ఇచ్చారు. గృహప్రవేశం అనంతరం లబ్ధిదారులు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాచకొండ భార్గవ్, జీడిముడ్ల శోభ, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బత్తుల శ్రీహరి, మాజీ ఉపసర్పంచ్ కొంతం బుచ్చిరెడ్డి, మాజీ వార్డు సభ్యుడు రాచకొండ వెంకటేశం, చెన్నోజు విజయ్ చారి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఊదరి నర్సింహ, ఊదరి స్వామి, ఊదరి రవి, ఐతరాజు శ్రీకాంత్, వల్లబోతు నరేష్, కొంతం మధు, జంగం సందీప్, వల్లబోతు సురేష్ తదితరులు పాల్గొన్నారు.





# యాదగిరికొండకు పోటెత్తిన భక్తజనం





**- సెలవు దినం సందర్భంగా కిటకిటలాడిన శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రం**

**- 85 వేల మంది భక్తుల దర్శనం.. ధర్మదర్శనానికి ఐదు గంటల నిరీక్షణ**

**తొలివెలుగు, యాదగిరిగుట్ట :** సెలవు దినం సందర్భంగా తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆదివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు తరలిరావడంతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. ఉదయం తెల్లవారుజాము నుంచే భక్తులు క్యూలైన్లలో బారులు తీరగా, రోజంతా రద్దీ కొనసాగింది. దేవస్థానం అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఒక్కరోజే సుమారు 85 వేల మంది భక్తులు శ్రీలక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తుల సంఖ్య అనూహ్యంగా పెరగడంతో ధర్మదర్శనానికి సుమారు ఐదు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ప్రత్యేక దర్శనం, ఉచిత దర్శనం, ప్రసాదాల కౌంటర్లు, టికెట్ కౌంటర్ల వద్ద కూడా భారీ క్యూలు కనిపించాయి. ఆలయ ప్రధాన గర్భాలయం, అంతరాలయం, క్యూకాంప్లెక్స్, ప్రత్యేక దర్శన మార్గాలు, ప్రసాద విక్రయశాలలు, లడ్డూ కౌంటర్లు, సత్యనారాయణ స్వామి వ్రత మండపం, కళ్యాణకట్ట, అన్నదాన సత్రం, విష్ణు పుష్కరిణి తదితర ప్రాంతాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ పరిసర ప్రాంతాల్లో ఎటు చూసినా భక్తుల సందడే కనిపించింది. స్వామివారి దర్శనానికి ముందు భక్తులు కొండ కింద ఉన్న విష్ణు పుష్కరిణిలో పవిత్ర స్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు. పలువురు భక్తులు కళ్యాణకట్టలో తలనీలాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం వాతావరణం చల్లగా ఉండటంతో పెద్ద సంఖ్యలో భక్తులు మెట్ల మార్గాన్ని ఎంచుకుని కాలినడకన కొండపైకి చేరుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి భక్తిశ్రద్ధలతో గోవింద నామస్మరణ చేస్తూ కొండపైకి చేరిన భక్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం ప్రత్యేక బ్యాటరీ వాహనాలను అందుబాటులో ఉంచింది. కొండపై బస్టాండ్ నుంచి తూర్పు రాజగోపురం వరకు ఈ వాహనాల ద్వారా భక్తులను సురక్షితంగా తరలించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దర్శనం సజావుగా జరిగేలా అదనపు సిబ్బందిని నియమించడంతో పాటు, క్యూలైన్ల నిర్వహణ, తాగునీటి సౌకర్యం, ప్రసాదాల పంపిణీ, అన్నదాన సేవలను నిరంతరాయంగా కొనసాగించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు, విజిలెన్స్, దేవస్థానం సిబ్బంది సమన్వయంతో సేవలందించారు. అన్నదాన సత్రంలో వేలాది మంది భక్తులు ప్రసాద భోజనం స్వీకరించగా, ప్రసాద విక్రయశాలల వద్ద కూడా రోజంతా రద్దీ కొనసాగింది. ఆలయంలోని ఆధ్యాత్మిక వాతావరణం, భక్తుల గోవింద నామస్మరణలతో యాదగిరికొండ ఆధ్యాత్మిక కాంతితో నిండిపోయింది. సెలవు దినం నేపథ్యంలో భక్తుల రద్దీ మరింత పెరగడంతో, యాదగిరిగుట్ట క్షేత్రం ఆదివారం రోజంతా భక్తజన సందోహంతో సందడిగా మారింది. దేవస్థానం అధికారులు భక్తులందరికీ సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపట్టి సేవలను సమర్థవంతంగా నిర్వహించారు.






జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..





## సాయి మందిరంలో సామూహిక పారాయణాలు

- భక్తిశ్రద్ధలతో లలితా సహస్రనామ అర్చన

**తొలివెలుగు, రాజాపేట:** మండల కేంద్రంలోని శ్రీరామకృష్ణ సాయి మందిరంలో జై శ్రీమన్నారాయణ భక్త బృందం ఆధ్వర్యంలో సామూహిక పారాయణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని సకల దేవతామూర్తుల సన్నిధిలో భక్తులు లలితా సహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా, గోవింద నామాలను సామూహికంగా పఠించారు. ఆలయ అర్చకులు చెలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ వేదమంత్రోచ్ఛారణల మధ్య దేవతామూర్తులకు విశేష పూజలు నిర్వహించి, మంగళహారతి సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పారాయణంలో బెజుగం స్వప్న, నంగునూరు స్వప్న, పుష్పలత, పెంట రజిత, మహేశ్వరి, రంగలక్ష్మి, నంగునూరి జగదాంబ, బోగ లత, నాళ్ల పద్మ తదితరులు పాల్గొన్నారు.

## మండల రహదారులకు మహర్దశ

**- రూ. 352 కోట్లతో పనుల మంజూరు: నమిల మహేందర్ గౌడ్**

**తొలివెలుగు, రాజాపేట:** ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రత్యేక శ్రద్ధతో రాజాపేట మండలంలో రహదారులకు మహర్దశ రానుందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, రేణిగుంట పీఏసీఎస్ చైర్మన్ నమిల మహేందర్ గౌడ్ అన్నారు. ఆదివారం రాజాపేట మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం, వంగపల్లిలో జరిగే పీఏసీఎస్ అభినందన సభకు కాంగ్రెస్ శ్రేణులతో కలిసి తరలివెళ్లారు. ఈ సందర్భంగా మహేందర్ గౌడ్ మాట్లాడుతూ.. రైతు సంక్షేమమే ధ్యేయంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పనిచేస్తున్నారన్నారు. పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి శాఖల ద్వారా రూ. 352 కోట్లతో రోడ్డు మరమ్మతులు, రాజాపేట మండలంలోని వివిధ గ్రామాలకు కొత్త రోడ్లు మంజూరయ్యాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల రవాణా కష్టాలను తీరుస్తున్నందుకు గాను మండల ప్రజల తరఫున సంబంధిత మంత్రులకు, ఎమ్మెల్యే ఐలయ్యకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగే పెంటయ్య గౌడ్, రాజాపేట పట్టణ అధ్యక్షుడు ఐరేని నవీన్ కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిల్వర్ బాలరాజు గౌడ్, ఉప సర్పంచ్ నమిల కేదారి గౌడ్, డాక్టర్ చింతల రవి, రేగు సిద్దులు, డిసిసి కార్యదర్శి ఇంజ నరేష్, చల్లూరు సర్పంచ్ భీమగాని రూప బాలనరసయ్య, నరసాపురం సర్పంచ్ ఎమ్మ శిరీష నాగరాజు, నాయకులు బూత్కూరు నరసింహారెడ్డి, మోత్కుపల్లి ప్రవీణ్, సట్టు సిద్దులు తదితరులు పాల్గొన్నారు.

## రామన్నపేట నూతన ఎస్సై సతీష్ గోపాటికి సన్మానం


**- మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన పీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం యాదగిరి**



**తొలివెలుగు, రామన్నపేట:** రామన్నపేట పోలీస్ స్టేషన్‌కు నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన సతీష్ గోపాటిని పీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం యాదగిరి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గడ్డం యాదగిరి మాట్లాడుతూ.. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని నూతన ఎస్సైకి ఆకాంక్షించారు. అనంతరం ఎస్సై సతీష్ గోపాటి మాట్లాడుతూ.. మండల పరిధిలోని ప్రజలు తమకు ఎదురయ్యే సమస్యలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా పరిశీలించి, చట్టపరంగా బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల సహకారంతో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకుడు గుండాల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి రామన్నపేట సాధన సమితి కృతజ్ఞతలు

**- నియోజకవర్గ ఏర్పాటు, 100 పడకల ఆసుపత్రికి హామీ**



**తొలివెలుగు, రామన్నపేట :** రామన్నపేట నియోజకవర్గ ఏర్పాటుకు, అలాగే ఇక్కడి ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చిన రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి రామన్నపేట నియోజకవర్గ సాధన సమితి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు ఆదివారం సమితి ప్రతినిధులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈ ప్రతిపాదనలకు మద్దతుగా నిలిచిన భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు కూడా సమితి ధన్యవాదాలు తెలియజేసింది. దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న ఆకాంక్షలు నెరవేరడానికి ప్రజా ప్రభుత్వం చొరవ చూపడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో సమితి గౌరవ అధ్యక్షుడు రెబ్బస్ రాములు, అధ్యక్షుడు బొడ్డుపల్లి లింగయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర రమేష్ గౌడ్, కార్యదర్శి గడ్డం యాదగిరి, ఎండి ఫజల్, పెండం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నిత్య కల్యాణ మహోత్సవం





- విశేష పూజలు, అభిషేకాలు, పుష్పార్చనలు.. భక్తిశ్రద్ధలతో పాల్గొన్న భక్తులు

**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఆదివారం నిత్య కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య విశేష పూజలు, హోమాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దివ్య కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో వీక్షించి ఆశీర్వాదాలు పొందారు. ఉదయం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో మహాభిషేకం నిర్వహించి, అనంతరం పట్టు వస్త్రాలు, విలువైన ఆభరణాలతో అలంకరించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పీఠంపై ఉత్సవ మూర్తులను అధిష్ఠింపజేసి వివిధ రకాల సుగంధ పుష్పాలతో పుష్పార్చనలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగింది. తదనంతరం నిత్య కల్యాణ మహోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించి, ప్రత్యేక సేవలో స్వామి, అమ్మవార్లను అధిష్ఠింపజేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను భాజాభజంత్రీలు, మంగళవాయిద్యాల మధ్య ఆలయ తీరు మాడ వీధుల్లో వైభవంగా ఊరేగించారు. ఈ ఊరేగింపును తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గోవింద నామస్మరణలతో భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సురేంద్రాచార్యులు, శ్రీధరాచార్యులు, కిరణ్ కుమార్‌తో పాటు దేవస్థానం అధికారులు, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి స్వామివారి ఆశీర్వచనాలు అందించారు. నిత్య కల్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా కొనసాగింది.

## రామన్నపేట ఆసుపత్రిని 100 పడకలకు విస్తరించాలి





- రోడ్ల నిర్మాణంతో పాటు కొత్త భవనం చేపట్టాలని సీపీఎం వినతి
- ఆరు నెలల్లో శంకుస్థాపనకు చర్యలు.. రోడ్ల సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చిన మంత్రి

**తొలివెలుగు, రామన్నపేట:** రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసి ఆధునిక సౌకర్యాలతో కూడిన నూతన భవనాన్ని నిర్మించడంతో పాటు, రామన్నపేట-పల్లెపహడ్, రామన్నపేట-కక్కిరేణి ప్రధాన రహదారులను తక్షణమే నిర్మించాలని సీపీఎం నాయకులు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రజల ఆరోగ్య అవసరాలు, రవాణా సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ పనులను ప్రాధాన్యతతో చేపట్టాలని కోరారు. ప్రస్తుతం రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి మండలంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు వైద్యం కోసం వస్తున్నప్పటికీ, పడకల కొరత, భవన వసతుల లేమి కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఆసుపత్రిని 100 పడకలకు విస్తరించి అన్ని విభాగాలతో కూడిన ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా రామన్నపేట-పల్లెపహడ్, రామన్నపేట-కక్కిరేణి రహదారులు శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రజలు, రైతులు, విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ రహదారులను నాణ్యమైన ప్రమాణాలతో పునర్నిర్మించాలని కోరారు. వినతిపత్రంపై స్పందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం చొరవతో రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవన నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టి, ఆరు నెలల్లో శంకుస్థాపన చేసేలా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు సీపీఎం నాయకులు తెలిపారు. అలాగే రామన్నపేట-పల్లెపహడ్, రామన్నపేట-కక్కిరేణి రహదారుల నిర్మాణ సమస్యను కూడా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. మంత్రి ఇచ్చిన హామీపై సీపీఎం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశంకు వారు కృతజ్ఞతలు తెలిపారు. త్వరితగతిన పనులు ప్రారంభించి ప్రజలకు మెరుగైన వైద్య, రవాణా సౌకర్యాలు అందుబాటులోకి తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు, మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## భువనగిరి-చిట్యాల నాలుగు లేన్ల రహదారికి శంకుస్థాపన







- రూ.339.59 కోట్లతో హెచ్ఏఎం విధానంలో నిర్మాణం.. రవాణా రంగానికి మరింత ఊతం
- శంకుస్థాపన చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ విప్ వేముల వీరేశం

**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి/రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లాలో దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూస్తున్న భువనగిరి-చిట్యాల నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన జరిగింది. రూ.339.59 కోట్ల వ్యయంతో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (ఎచ్ఏఎమ్) విధానంలో భువనగిరి నుంచి చిట్యాల వరకు రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించనున్నారు. ఈ ప్రాజెక్టుకు తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. భువనగిరి-చిట్యాల రహదారి విస్తరణ కోసం ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారని, ప్రజా ప్రభుత్వం ఆ కలను నెరవేర్చుతోందన్నారు. రాష్ట్రంలో రహదారి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు సురక్షితమైన, వేగవంతమైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ.. ఈ నాలుగు లేన్ల రహదారి పూర్తయితే భువనగిరి-చిట్యాల మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా రహదారి విస్తరణ అత్యంత అవసరమైందని, ఈ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ప్రజలకు మరింత సురక్షితమైన ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ ప్రాజెక్టు అమలుతో రహదారి భద్రత మెరుగుపడటంతో పాటు, రవాణా సౌకర్యాలు విస్తరించి, ప్రాంతీయ వాణిజ్యం, వ్యవసాయం, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త ఊపు లభించనుందని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యంగా రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు వేగంగా తరలించే అవకాశం కలగడంతో పాటు, పరిశ్రమలు, వ్యాపార కార్యకలాపాలకు కూడా ఈ రహదారి కీలకంగా మారనుంది. భువనగిరి, చిట్యాలతో పాటు పరిసర ప్రాంతాల అభివృద్ధికి ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రజానాయకులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భువనగిరి-చిట్యాల నాలుగు లేన్ల రహదారి నిర్మాణం పూర్తయిన తర్వాత జిల్లాలో రవాణా వ్యవస్థ మరింత బలోపేతం కావడంతో పాటు ఆర్థిక, పారిశ్రామిక, వాణిజ్య రంగాల అభివృద్ధికి ఈ ప్రాజెక్టు కీలకంగా నిలవనుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# లింగోటం చేనేత సంఘం బాధ్యతల స్వీకరణ





- ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ పావని రమేష్ గౌడ్, గ్రామ సర్పంచ్ బీమిడి ప్రదీప్ జీ
- అధ్యక్షుడిగా తడక నరసింహ బాధ్యతల స్వీకరణ

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మండలంలోని స్వాములవారి లింగోటం చేనేత సహకార సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై, నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను అభినందించారు. చేనేత కార్మికుల సంక్షేమానికి నూతన పాలకమండలి కృషి చేయాలని ఆమె ఆకాంక్షించారు. సంఘం అధ్యక్షుడిగా తడక నరసింహ, ఉపాధ్యక్షుడిగా అరిగె నర్సింహ, కార్యదర్శిగా కోడెం గణేష్, డైరెక్టర్లుగా కందగట్ల కిషన్, కోమటి గోవర్ధన్, గర్దాసు సత్యనారాయణ, తాటి రవి, మహిళా డైరెక్టర్లుగా గంజి శోభ, వనం సంతోషలు ప్రమాణ స్వీకారం చేసి పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ వేడుకలో గ్రామ సర్పంచ్ బీమిడి ప్రదీప్ జీ, సంఘం మాజీ అధ్యక్షుడు జెల్లా లక్ష్మీనారాయణ, మాజీ ఉపాధ్యక్షుడు గద్దం భాస్కర్, మాజీ కార్యదర్శి గంజి గణేష్, మాజీ కోశాధికారి కోడెం సత్యనారాయణ, గ్రామ ఉపసర్పంచ్ బాతరాజు ధనుంజయ, గ్రామ పెద్దలు చెన్నగోని అంజయ్య, ఢిల్లీ మాధవరెడ్డి, పద్మశాలి కుల సంఘం సభ్యులు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

# క్యాన్ నీళ్లు కొనలేం.. కష్టాలు పడలేం!

- పెద్దకొండూరు దళితవాడలో మౌలిక వసతుల కొరత
- వ్యవసాయ కార్మిక సంఘం ఇంటింటి సర్వేలో ప్రజల సమస్యల వెల్లడి



**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మండలం పెద్దకొండూరు గ్రామంలోని దళితవాడలో తాగునీరు, రహదారులు, మురుగు కాలువలు, వీధి దీపాలు వంటి కనీస మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (సీపీఎం) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఇంటింటి సర్వేలో వెల్లడైంది. సర్వే సందర్భంగా పలువురు స్థానికులు తమ సమస్యలను సంఘం ప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామ పంచాయతీ ద్వారా సరఫరా అయ్యే తాగునీటిని కూడా డబ్బులు చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తోందని, నిరుపేద కుటుంబాలకు క్యాన్ నీరు కొనుగోలు చేయడం భారంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సర్వేలో పాల్గొన్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గంగదేవి సైదులు మాట్లాడుతూ.. దళితవాడలో కనీసం నడిచేందుకు సీసీ రోడ్లు కూడా లేకపోవడం, మురుగు కాలువలు, వీధి దీపాల కొరత వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు మంజూరు జరిగినప్పటికీ ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో పలువురు లబ్ధిదారులు అప్పులు చేసి పునాదులు వేసి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం మహిళలకు ప్రకటించిన రూ.2,500 ఆర్థిక సహాయాన్ని అమలు చేయాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, గ్రామంలో ఉపాధి హామీ పనులను వెంటనే ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం, అధికారులు తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో ప్రజలను కలుపుకొని ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సర్వేలో సంఘం మండల నాయకులు చింతల సుదర్శన్, యాట బాలరాజు, మానే సాలయ్య, జక్కిడి దేవేందర్ రెడ్డి, జెక్కిడి రమణారెడ్డి, అంజిరెడ్డి, బాలరెడ్డి, మురళీధర్ రెడ్డి, రమేష్, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ఇందిరమ్మ ఇళ్లు సాకారం

- చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్
- 17వ వార్డులో ఇందిరమ్మ ఇంటి ప్రారంభం




**తొలివెలుగు, చౌటుప్పల్:** ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇంటి కలను నిజం చేయడం ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో మహమ్మద్ రహమత్ నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లును ఆదివారం ఆమె రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత నీడ కల్పించాలనే గొప్ప సంకల్పంతో ప్రభుత్వం ఇందిరమ్మ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి ఆశీర్వాదంతో మున్సిపాలిటీ పరిధిలోని అర్హులకు ఇళ్లు మంజూరవుతున్నాయని, పేదల సంక్షేమం కోసం ఎమ్మెల్యే ఎల్లప్పుడూ కృషి చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, 17వ వార్డు కౌన్సిలర్ చింతల ఉమామహేశ్వరి సాయిలు, కౌన్సిలర్లు ఎండీ హన్నుబాయి, పాక చిరంజీవి, కో-ఆప్షన్ మెంబర్లు పస్తం గంగ రాములు, ఎండీ బాబా షరీఫ్, షాదీఖానా చైర్మన్ ఎండీ కరీం, కాంగ్రెస్ నాయకులు ఎండీ ఎజాస్ పాషా, ఎండీ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆందోళ్ మైసమ్మ గుడిలో రేకుల షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

- భక్తుల సౌకర్యార్థం నూతన వసతి
- దాత విజయ్ సేవలు అభినందనీయం: ఆలయ చైర్మన్ కంచర్ల అశ్విన్ రెడ్డి

**తొలివెలుగు, చౌటుప్పల్:** మండలంలోని దండు మల్కాపురం గ్రామ సమీపంలో గల ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ ఆందోళ్ మైసమ్మ దేవస్థాన ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం నిర్మించనున్న నూతన రేకుల షెడ్డు నిర్మాణ పనులకు ఆలయ చైర్మన్ కంచర్ల అశ్విన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవస్థానానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించడమే ఆలయ కమిటీ ప్రధాన ధ్యేయమన్నారు. ఈ నిర్మాణానికి కొత్తపేటకు చెందిన విజయ్ దాతగా ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని కొనియాడారు. శంకుస్థాపన కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు వల్లూరి శివప్రసాద్ వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు జొన్నగంటి దాసు, పంతంగి రమేష్, మన్నే మహేందర్ రెడ్డి, ఈడుదుల బాబు యాదవ్, సిద్దిపేట ఆనంద్ రెడ్డి, బెతల నర్సింహం, వెంకిర్యాల శివచారి, బాలాగోని శ్రీకాంత్ గౌడ్, దౌడి రాజేష్, చిట్టంపల్లి సబిత-యాదయ్య, ఆలయ జూనియర్ సహాయకుడు సత్తిరెడ్డి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.






# ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు నూతన డైరెక్టర్ల కృతజ్ఞతలు

- పీఏసీఎస్ పాలక మండలిలో అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు

**తొలివెలుగు, ఆత్మకూరు(ఎం) :** ఆత్మకూరు(ఎం) మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) పాలక మండలిలో కూరెళ్ల గ్రామం నుంచి డైరెక్టర్లుగా అవకాశం కల్పించినందుకు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు నూతన డైరెక్టర్లు భాషబోయిన సత్యనారాయణ, కూరెళ్ల యాదమ్మ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమపై నమ్మకం ఉంచి పీఏసీఎస్ పాలక మండలిలో డైరెక్టర్లుగా బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని అన్నారు. రైతుల సంక్షేమం, సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తూ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తామని తెలిపారు. అలాగే పీఏసీఎస్ చైర్మన్ యాస లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కందడి అనంతరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు అందించిన సహకారానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. తమ ఎన్నికకు సహకరించిన తాజా మాజీ వైస్ ఎంపీపీ భాషబోయిన పద్మ-పాపయ్య, కూరెళ్ల గ్రామ మాజీ సర్పంచ్ భాషబోయిన చంద్రమ్మ-ఎల్లయ్య, గణగాని శ్రీనివాస్, ఐదో వార్డు సభ్యుడు భాషబోయిన లింగం, బెజ్జంకి భిక్షం, ఉప్పల నరసింహ, నార్కట్‌పల్లి సహదేవులు, గ్రామ పెద్దలు, పార్టీ కార్యకర్తలకు కూడా వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రైతుల ప్రయోజనాలే తమ ప్రధాన లక్ష్యమని, సహకార సంఘం ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందేలా కృషి చేస్తామని నూతన

# వలిగొండ పంచాయతీకి ఎలక్ట్రిక్ పారిశుద్ధ్య వాహనం

కుంభం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేత.. ప్రారంభించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి





**తొలివెలుగు, వలిగొండ :** గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో కుంభం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వలిగొండ గ్రామ పంచాయతీకి ఎలక్ట్రిక్ పారిశుద్ధ్య వాహనాన్ని ఆదివారం అందజేశారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వాహనాన్ని ప్రారంభించి, గ్రామ పంచాయతీ సిబ్బందికి అప్పగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధిలో పారిశుద్ధ్యం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. పరిశుభ్రమైన గ్రామాలే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని పేర్కొంటూ, ఆధునిక సాంకేతికతను వినియోగించి గ్రామాల్లో పారిశుద్ధ్య సేవలను మరింత మెరుగుపరచాలని సూచించారు. సాంప్రదాయ ఇంధన వాహనాలతో పోలిస్తే ఎలక్ట్రిక్ పారిశుద్ధ్య వాహనాల వినియోగం వల్ల గ్రామ పంచాయతీలపై ఇంధన వ్యయం, నిర్వహణ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే బ్యాటరీతో నడిచే ఈ వాహనాలు పర్యావరణహితంగా ఉండటంతో వాయు కాలుష్యాన్ని తగ్గించడంలోనూ కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. భవిష్యత్తులో స్థానిక సంస్థల్లో పర్యావరణహిత వాహనాల వినియోగాన్ని మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామంలో చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణను క్రమబద్ధంగా నిర్వహించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య సిబ్బంది నిరంతరం కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజలు కూడా తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వడం ద్వారా గ్రామ పారిశుద్ధ్య కార్యక్రమాలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కుంభం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించిన ఈ ఎలక్ట్రిక్ పారిశుద్ధ్య వాహనం గ్రామ పంచాయతీ పనితీరును మరింత మెరుగుపరచడంతో పాటు, పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో వలిగొండ గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు, పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోచంపల్లిలో ఉచిత ఎముకల వైద్య శిబిరం

200 మందికి పరీక్షలు, ఉచిత మందుల పంపిణీ

బోధిధర్మ యోగ అసోసియేషన్ అధ్యక్షులు డా. సీతా భాస్కర్



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** ప్రజల ఆరోగ్యం, సమాజ సేవ ప్రధాన లక్ష్యాలుగా బోధిధర్మ యోగ అసోసియేషన్ పనిచేస్తోందని ఆ సంస్థ అధ్యక్షులు డాక్టర్ సీతా భాస్కర్ అన్నారు. పోచంపల్లి పురపాలక కేంద్రంలో ఆదివారం బోధిధర్మ యోగ అండ్ హెల్త్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, హైదరాబాద్ రాజరాజేశ్వరి నర్సింగ్ హోమ్ సౌజన్యంతో ఉచిత ఎముకల వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని డాక్టర్ సీతా భాస్కర్ ప్రారంభించారు. ?అనంతరం ప్రముఖ ఆర్థోపెడిక్ నిపుణులు డాక్టర్ ఎం.ఎస్. విశ్వనాథ్ నేతృత్వంలో సుమారు 200 మంది బాధితులకు ఎముకల సాంద్రత, కీళ్ల నొప్పుల పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బోధిధర్మ యోగ అండ్ హెల్త్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కడవేరు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి చింతల రామకృష్ణ, సహాయ కార్యదర్శులు దోర్నాల బాలరత్నం, రణం రాజశేఖర్, కోశాధికారి కొండమడుగు మల్లేష్, సాంస్కృతిక కార్యదర్శి వనం వెంకటేష్, కార్యవర్గ సభ్యులు దోర్నాల బాలరాజు, బావండ్ల రాజు, వీడెం విష్ణు, గౌరవ సలహాదారులు ఈపూరి ముత్యాలు, కర్నాటి బాలరాజు, సంఘం చంద్రయ్య, గౌరవ సభ్యుడు వీడం రామనాథం, సభ్యులు చింతకింది కిరణ్, కేమ విష్ణు, కృష్ణ కుమార్, నాగరాజు, బిట్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..


# ‘లెనిన్’ మూవీ రివ్యూ..

## అఖిల్ మెప్పించాడా?

టైటిల్ ప్రకటించిన నాటి నుంచీ అఖిల్ ‘లెనిన్’ సినిమాపై అంచనాలు మొదలయ్యాయి. అఖిల్ రగ్గడ్ గెటప్, కథా నేపథ్యం, ప్రచార చిత్రాలు, విడుదలైన పాటలు.. ఇవన్నీ సినిమాపై ఆసక్తిని పెంచాయి. అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మాతలు కావడంతో కచ్చితంగా సినిమా బావుంటుందని ఆడియన్స్ ఫిక్సయిపోయారు. అఖిల్ కెరీర్‌లో ‘లెనిన్’కి వచ్చినంత హైప్ మరే సినిమాకూ రాలేదన్నది నిజం. ఎట్టకేలకు ఈ శు క్రవారం ‘లెనిన్’గా అఖిల్ థియేటర్లలోకి అడుగపెట్టాడు. మరి అందరి అంచనాలనూ ‘లెనిన్’ నిజం చేశాడా? ఈ సారైనా అఖిల్‌కి సరైన విజయం దక్కిందా? ఈ ప్రశ్నలకు సమాధానం కావాలంటే ముందు కథలోకెళ్లాలి..

తారాగణం: అఖిల్, భాగ్యశ్రీ బోర్సే, ప్రమోద్ పంజు, ఈశ్వరీరావు, రాంకీ, శివాజీ, సునీల్..

దర్శకత్వం : మురళీకిశోర్ అబ్బూరి
సంగీతం: తమన్

నిర్మాతలు: అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ లెనిన్ మూవీ టిక్కెట్లు

బలాలు
కథనం, అఖిల్ నటన, తమన్ నేపథ్య సంగీతం

బలహీనతలు
ప్రథమార్థం స్లో అవ్వడం, రక్తపాతం మరీ ఎక్కువ కావడం..

తమన్ నేపథ్య సంగీతం బావుంది. ‘వారెవా..వారెవా..’ సాంగ్ వినడానికి కూడా బావుంది

**రేటింగ్ : 3/5**




### కథ

అది రాయలసీమలోని రామాపురం అనే గ్రామం. పగలకు, ప్రతీకారాలకు దూరంగా ఉండే గ్రామం అది. రక్తం ఆ నేలను అప్పటివరకూ తాకలేదు. ఆ ఊరిలో సంప్రదాయ జాతర జరుగుతుండగా, ఓ పదేళ్ల పిల్లాడు ఆ ప్రాంతంలోకి అడుపెట్టాడు. అ పిల్లాడి పేరు ‘లెనిన్’. అమ్మానాన్న లేని అనాథ అయిన లెనిన్‌ని ఆ ఊరి పెద్దావిడ(ఈశ్వరీరావు) అక్కున చేర్చుకుంది. ఆమె కొడుకైన వసంత్(ప్రమోద్ పంజు)తో లెనిన్‌కి బలమైన స్నేహబంధం ఏర్పడింది. వసంత్‌తో పాటు లెనిన్ కూడా ఆ ఇంట్లోనే పెరిగి పెద్దయ్యాడు.. కట్ చేస్తే.. కొన్నేళ్ల తర్వాత లెనిన్ జైలు నుంచి విడుదలయ్యాడు. ఆ ఊరిలోకి అడుగుపెట్టి ఆ ఊరి జనాలైన వందమందిని నరికి చంపాడు. చివరకు తన ప్రాణస్నేహితుడైన వసంత్‌ని కూడా అతి దారుణంగా పొడిచి చంపాడు. అసలు లెనిన్ జైలుకి ఎందుకెళ్లాడు? రక్తం రుచే తెలియని ఆ నేలపై రక్తపాతం ఎందుకు సృష్టించాడు? ప్రాణ స్నేహితుడైన వసంత్ ప్రాణాన్ని ఎందుకు బలి తీసుకున్నాడు? ఈ ప్రశ్నలకు సమాధానమే అసలు కథ.సినిమా రివ్యూ బ్లాగ్

### విశ్లేషణ

పరువు, ప్రేమ, స్నేహం, నమ్మకద్రోహం నేపథ్యంలో సాగే కథ ఇది. కథకుడు, దర్శకుడు మురళీకిశోర్ అబ్బూరి ఈ కథను నడిపించిన తీరు బావుంది. ఇదొక విభిన్నమైన స్క్రీన్‌ప్లే. ప్రథమార్థం ఇదేదో పరువు కోసం ప్రాణాలు తీసే వ్యక్తుల చుట్టూ తిరిగే కథగానే అంతా భావిస్తారు. కానీ సెకండాఫ్‌లో ఈర్ష్యా, ద్వేషం, నమ్మకద్రోహం కోణాలు కథలో బహిర్గతమవుతాయి. ఈర్ష్యా, ద్వేషం అనేవి పవిత్రమైన స్నేహాన్ని సైతం నిర్వీర్యం చేస్తాయని ఈ కథ ద్వారా మురళీకిశోర్ అబ్బూరి తెలిపారు. అనాథగా ఆ ఊరు వచ్చిన లెనిన్ ‘నా’ అనుకున్న వారందర్నీ సంపాదించుకున్నానని భ్రమ పడతాడు. తాను ఎప్పటికీ అనాథనేనని తెలుసుకుకోవడంతో కథ ముగుస్తుంది. స్నేహానికీ, ప్రేమకీ లొంగిపోయే లెనిన్ నమ్మకద్రోహానికి బలైపోయాడు. అదే ఈ సినిమా కథ. చాలా సీరియస్ సబ్జెక్ట్ ఇది. క్షణక్షణానికి మారుతున్న వ్యక్తులు మనస్తత్వాలను ఈ సినిమాలో చూడొచ్చు. మంచి వాళ్లుగా కనిపిస్తున్న మేకవన్నె పులుల మధ్య జీవితాన్ని సాగించి, సర్వం కోల్పోయిన లెనిన్‌ని ఈ సినిమాలో చూడొచ్చు. ప్రథమార్థం చివరి ఇరవై నిమిషాల్లో సినిమాలోని అసలు కథ మొదలైంది. కథలోకి వెళ్లడం ఆలస్యం కావడం వల్ల కథనం నిదానించినట్టు అనిపిస్తుంది. ద్వితీయార్థం ఆద్యంతం ఊహించని మలుపులతో ఆసక్తికరంగా సినిమా సాగింది. మొత్తంగా దర్శకుడు మురళీకిశోర్ వైవిధ్యమైన కథనంతో ఈ కథను నడిపించి సినిమాను నిలబెట్టారు.






### నటీనటులు

ఇక ‘లెనిన్’గా కొత్త అఖిల్‌ని ఈ సినిమాలో చూస్తారు. ఇప్పటివరకూ ఆయన చేసిన సినిమాలన్నీ ఒకెత్తూ, ‘లెనిన్’ ఒకెతు. అమాయకత్వం, మంచి తనం, మూర్ఖత్వం కలగలిసిన ఈ పాత్రలో అఖిల్ జీవించాడనే చెప్పాలి. అతనిలోని పరిపూర్ణమైన నటుడ్ని ‘లెనిన్’లో చూడొచ్చు. ముఖ్యంగా ద్వితీయార్థంలో అఖిల్ అద్భుతంగా నటించాడు. అతని కెరీర్‌లో బెస్ట్ పెర్‌ఫార్మెన్స్‌గా ‘లెనిన్’ని చెప్పొచ్చు. ఇక భాగ్యశ్రీబోర్సే తనదైన అందచందాలతోపాటు చక్కటి అభినయంతో కూడా ఆకట్టుకున్నది. ఈ సినిమాలో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన వసంత్‌గా నటించిన ప్రమోద్ పంజు గురించి. తనది ఇందులో మేకవన్నె పులి లాంటిపాత్ర. మంచివాడిగా కనిపిస్తూ ఉన్నట్టుండి దుర్మార్గుడిగా ఎస్టాబ్లిష్ అయ్యే పాత్ర అది. ఆ పాత్రలో తన నిజంగా అదరహో అనిపించాడు. ఈ సినిమాతో అతనికి మంచి పేరు రావడం ఖాయం. ఇక శివాజీ, ఈశ్వరీరావు, రాంకీ.. ఇలా అంతా పరిధిమేర పాత్రలకు న్యాయంచేశారు.